క్లుప్తంగా

సరిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్


సరిపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంతోష్

గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలోనూ మెగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి అన్ని వ్యాధులకూ పరీక్షలు, ఉచితంగా మందులు అందిస్తామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. గురువారం గణపవరం మండలం సరిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు ప్రతి వారం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పీహెచ్‌సీలోనే ప్రసవాలు చేసుకోవాలని సంతోష్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన 220 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగులకు ఇంటివద్ద వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు


గణపవరం హైస్కూల్లో విద్యార్థికి కంటి పరీక్ష చేస్తున్న దృశ్యం

గణపవరం: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన వైద్యం పొందాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆకు కూరలు తినడంద్వారా రక్తహీనతకు, కంటి సమస్యలకు దూరంగా ఉండవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా దాదాపు 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 31 మందికి కళ్ల జోళ్లు అవసరమని, వీరికి వారం రోజుల్లో కళ్లజోళ్లు అందజేస్తామని అప్తాలమిక్ అసిస్టెంట్ శ్రీనివాస్ తెలిపారు. సీహెచ్‌ఓ జాలాది విల్సన్, హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు దేవదాసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ సంకల్పం 'సైడ్ ట్రాక్'

- రూ.25 లక్షలతో బ్యూటిఫికేషన్
- మట్టి పోసి, గడ్డి పరిస్తే సరిపోతుందా?


సీఆర్ఆర్ కాలేజీ సమీపంలో న్యాయమూర్తుల బంగ్లాల సమీపంలో ఇలా


సీఆర్ఆర్ గ్రౌండ్స్ ఎదురుగా ఎస్పీ క్యాంప్ ఆఫీస్ వైపు ఇల

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆలోచనా విధానంతో జిల్లా అధికారులు ఏలూరు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఏలూరు నగరంలోని పలు ప్రాంతాలను అభివృద్ధి, బ్యూటిఫికేషన్ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. కానీ నగరపాలక సంస్థ అధికారులు మాత్రం అవేమీ పట్టనట్టు వ్యవహరించటం గమనార్హం.

కానరాని 'ట్రాక్'

నగరంలోని పలు ప్రాంతాల్లో సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలనే సంకల్పంతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పనిచేస్తున్నారు. సీఆర్ఆర్ అటానమస్ కళాశాల సమీపంలో రోడ్డు వెంబడి గోడలకు రంగులు వేయించారు. ఆ ప్రాంతమంతా పచ్చటి వాతావరణం కనిపించేలా పచ్చగడ్డి వేయటం, మధ్యలో ట్రాక్ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం రూ.25 లక్షలు నగరపాలక సంస్థ నిధులను వెచ్చించారు. ఈ పనులన్నీ గత మూడు నెలలుగా కొనసాగుతున్నాయి. ఏదో తూతూమంత్రంగా ఎర్ర మట్టి వేసేశారు. పచ్చగడ్డి పరిచేశారు. మధ్యలో అక్కడక్కడా రాళ్లు వేసుకుంటూ వెళ్లారు. ట్రాక్ ఎక్కడుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

వర్షాలు కురిస్తే ఇబ్బందే

ఏలూరు కొత్తబస్టాండ్ నుంచి సత్రంపాడు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి న్యాయమూర్తుల గృహ సముదాయాలు, జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం, జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం, ఏలూరు రేంజ్ డీఐజీ క్యాంపు కార్యాలయం ఉంటాయి. ఈ ప్రాంతాన్ని సుందరీకరించేందుకు నిధులు కేటాయించారు. ఈ పనుల్లో నాణ్యత లోపించిందనే అభిప్రాయం ఉంది. ప్రధాన రహదారిపై నుంచి వర్షపు నీరు డ్రెయినేజీలోకెళ్లే అవకాశం లేకుండా మధ్యలో ఎర్రమట్టిని రోడ్డుకంటే ఎత్తుగా వేసి, పచ్చగడ్డి వేశారు. ఇలా చేయటం వల్ల రోడ్డుపై నీరు నిల్వ ఉండిపోయి పాడయ్యే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

సక్రమంగా చేయిస్తాం

నగరంలో బ్యూటిఫికేషన్ పనులు పెద్దెత్తున చేపడుతున్నాం. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక శ్రద్ధతో నగరంలోని పలు చోట్ల సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. నడిచేందుకు ట్రాక్, గ్రీనరీ, ప్లాంటేషన్ చేయాలని ఉద్దేశించాం. నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో పనులు చేయిస్తాం.

– సంక్రాంతి వెంకటకృష్ణ, నగర కమిషనర్

కొబ్బరి రైతుల సదస్సుపై ప్రచారం

పెదవేగి : కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 16న రాజమండ్రిలో నిర్వహించే కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పెదవేగి మండలం విజయరాయి, రాయన్నపాలెం, కొండలరావు పాలెం, బాపిరాజు గూడెం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు ప్రచారం చేశారు.

నేడు సమీక్షా సమావేశాలు

భీమడోలు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వివిధ శాఖల పరిధిలో స్పందన ఫిర్యాదులు, అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. మండల ప్రత్యేకాధికారి విజయరాజు అధ్యక్షత నిర్వహించే ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు విధిగా హాజరు కావాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షా పథకంపై స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షత జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, విద్య, ఐసీడీఎస్ అధికారులు హాజరు కావాలన్నారు.

హిందీ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలి


హిందీ పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ భాష హిందీకి విద్యార్థులు తగిన ప్రాధాన్యత ఇచ్చేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని స్థానిక హిందీ నికేతన్ అధ్యక్షుడు వి.వెంకటస్వామి కోరారు. గురువారం రాజభాష హిందీ దినోత్సవాన్ని ఏలూరు పవర్‌పేటలో ఉన్న హిందీ నికేతన్‌లో సంస్థ అధ్యక్షుడు వెంకటస్వామి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జాతీయ భాష ప్రచారం దేశభక్తి కార్యమన్న మహాత్మాగాంధీ పిలుపందుకొని పిన్నింటి సత్యనారాయణ 1950వ సంవత్సరంలో నగరంలో హిందీ నికేతన్ సంస్థను స్థాపించి ఎంతోమంది ఉత్తమ హిందీ పండితులను తయారు చేశారని, నేటికీ వారి ఆశయాన్ని కొనసాగిస్తూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఉన్నత ప్రమాణాలతో హిందీ భాష అందిస్తున్నట్టు వెంకటస్వామి వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ భారత ప్రభుత్వం హిందీకి రాజభాష దర్జా ఇచ్చి, హిందీ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. హిందీ నికేతన్ సంస్థ గత 73 సంవత్సరాల్లో వేలాదిమంది హిందీ పండితులను తయారు చేసి రాజభాష పట్ల వారి బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథి లేళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హిందీ నికేతన్ సంస్థ అంటే హిందీ భాష ఔన్నత్యాన్ని చాటే సంస్థని, ఈ సంస్థ సేవా కార్యక్రమాలకు ముగ్ధులైన నాటి రాష్ట్రపతులు డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సందర్శించడమే కాకుండా సర్వేపల్లి రాధాకృష్ణన్ స్వయంగా తన రచనలను హిందీ, తెలుగు భాషల్లోకి అనువదించాలని సత్యనారాయణను కోరటం ఆయన గొప్పతనాన్ని ప్రతిబింబింపజేస్తుందని చెప్పారు.

విజేతలకు బహుమతులు

జిల్లా స్థాయిలో నిర్వహించిన హిందీ వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో 613 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ విభాగం వ్యాసరచనలో ఎం గాయత్రి, పి.సాహితి, ఎస్ భువన, వక్తృత్వంలో ఎం మీనాక్షి, పి.కనకమహాలక్ష్మి, ఆర్ దేవి ప్రకీర్తన, జూనియర్ విభాగం వ్యాసరచనలో జి.జ్ఞానేశ్వర్ సాయి, పి.దేవి సౌజన్య, కె.శార్విన్, వక్తృత్వంలో పి.దేవి సౌజన్య, యు.రక్షిత, ఎ.ధర్మ కరుణాకర్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి అతిథులు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. తొలుత మహాత్మా గాంధీ, హిందీ నికేతన్ వ్యవస్థాపకులు పిన్నింటి సత్యనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పి.కవితాకుమారి, పలువురు హిందీ పండితులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు – నేడు పనులు వేగవంతం చేయాలి


నాడు నేడు పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ, ఎంఈఓ

ఏలూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు – నేడు పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. గురువారం ఆయన ఎంఈఓ ఆర్ రంగయ్య, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ప్రభుత్వ విద్యారంగం బలోపేతమైందని ఎంపీపీ అన్నారు. నాడు నేడు పథకం ద్వారా రూ.కోట్లు ఖర్చు చేసి పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతులు కల్పిస్తుండడంతో పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. అనంతరం నాడు నేడు రెండో దఫా పనుల్లో భాగంగా రూ.1.80 కోట్లుతో గుడివాకలంక, చాటపర్రు, మొండికోడు పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎంపీపీ సమీక్షించారు. గోదావరి వరద కారణంగా ఇసుక కొరత ఏర్పడిందని రంగయ్య తెలిపారు. కొద్దిరోజుల్లో ఇసుక అందుబాటులోకి వస్తుందని, వెంటనే పనులు ఊపందుకుంటాయని అన్నారు. మొండికోడు ప్రాథమిక పాఠశాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రధానోపాధ్యాయులు ఉదాశీనంగా వ్యవహరించకుండా చూడాలని ఎంఈఓ, కాంట్రాక్టర్‌ను ఎంపీపీ ఆదేశించారు.

19 నుంచి మాలల చలో ఢిల్లీ


మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్

ఏలూరు (టూటౌన్): ఈ నెల 19 నుంచి 22 వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎస్సీ వర్గీకరణ వద్దు.. రాజ్యాధికారం ముద్దు, హలో మాల.. చలో ఢిల్లీ నినాదంతో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మాలమహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పిలుపు నిచ్చారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరగదని గతంలో సుప్రీంకోర్టు కేసు కొట్టివేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయినా దళితుల మధ్య చిచ్చుపెట్టేందుకు అగ్రవర్ణ పార్టీలు ఆడే కపట నాటకాలకు అడ్డుకట్ట వేసేందుకు పార్లమెంటు ముట్టడికి మాల నిరుద్యోగులు, ఉద్యోగస్తులు, మేధావులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంది జయరాజు, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, జిల్లా కార్యదర్శి చిల్లే రాజ్ కుమార్, సీనియర్ నాయకులు నేతల సాల్మన్ రాజు, చిగురుపాటి రాజేష్, జొన్నల వజ్రం, మద్దా శాంతారావు, కోరం రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఇంజినీర్ పాత్ర కీలకం


సూరత్ తేజ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజాభివృద్ధిలో ఇంజినీర్ పాత్ర కీలకమని సోమా కన్‌స్ట్రక్షన్స్ ఇంజినీర్ సూరత్ తేజ పేర్కొన్నారు. ఇంజినీర్స్‌డేను పురస్కరించుకుని గురువారం తన కార్యాలయంలో యువ ఇంజినీర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంజినీర్ల సృజనాత్మకత కారణంగానే బహుళ అంతస్తుల భవనాలు, అద్దాల మేడలు సమాజానికి పరిచయమయ్యాయని తేజ అన్నారు. దేశ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉంటున్న సివిల్, కంప్యూటర్ ఇంజినీర్లు సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు.

రాగివైరు చోరీపై కేసు

పెదపాడు : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు మండలం కొక్కిరపాడు గ్రామ పంట పొలాల్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రాగి వైరు చోరీ చేశారు. దీనిపై రైతులు విద్యుత్ శాఖ ఏఈ రాంబాబుకు సమాచారం అందించగా, ఆయన ఘటనాస్థలిని పరిశీలించారు. విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన

దెందులూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేసినట్టు మండల ప్రత్యేకాధికారి కృపావరం, డీఎల్‌పీఓ ఏబీపీపీ లక్ష్మి తెలిపారు.